స్నాతకోత్సవం నిర్వహించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్ : వైవీయూ పరిధిలో ఉన్న విద్యార్థులకు స్నాతకోత్సవం నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి కోరారు. బుధవారం నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప యోగి వేమన యూనివర్సిటీ పరిధిలోని కళాశాలలలో చదివినటువంటి విద్యార్థులు రెండు సంవత్సరాలుగా కాన్వకేషన్ కోసం నిరీక్షిస్తున్నారని పేర్కొన్నారు. కాన్వకేషన్ విద్యార్థులకు ఎంతో ముఖ్యమైందని తెలిపారు. ఉత్తీర్ణత గుర్తింపు పట్టా విద్యార్థులకు ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు కీలకంగా నోటిఫికేషన్ వచ్చి చాలా రోజులవుతున్నా అందులో 13 వేల మంది విద్యార్థులు ఒరిజినల్ డిగ్రీ పట్టా కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. కాన్వకేషన్ నిర్వహించకపోవడంతో విద్యార్థులు సతమతమవుతూ పట్టా కోసం ఎదురుచూస్తున్నారని, కావున వెంటనే కాన్వకేషన్ నిర్వహించి విద్యార్థులకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జిఎంసిలో సీటు పోరు!

అకడమిక్, ఎస్టాబ్లిష్ సూపరింటెండెంట్ల మధ్య పోటీ
సిడిఎస్ నిధుల స్వాహా కుతంత్రం?
చోద్యం చూస్తున్న జిఎంసి ప్రిన్సిపల్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల అకడమిక్ సెక్షన్ సూపరింటెండెంట్, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ సూపరింటెండెంట్ మధ్య బిగ్ ఫైట్ నడుస్తోంది. అకడమిక్ సూపరింటెండెంట్ సీటు మార్పు వ్యవహారం విబేధాలకు దారి తీసినట్లు తెలుస్తోంది. ఏడాదిన్నర కిందట వైసిపి సర్కారు కడప, పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలల పరిధిలోని అటెండర్ దగ్గర నుంచి పలు టెక్నీషియన్ పోస్టుల వరకు 120 పైగా ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అనంతరం సార్వత్రిక ఎన్నికల రావడంతో ఖాళీల భర్తీ ప్రక్రియ నిలిచి పోయిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని కూటమి సర్కారు ఇటీవల ఖాళీలను భర్తీ చేయాలని ఆదేశించింది. కడప జిఎంసి అధికార యంత్రాంగం జిఎంసి, జిజిహెచ్, సూపర్ స్పెషాలిటీ, మెంటల్, కేన్సర్ కేర్ విభాగాల పరిధిలోని 44 నుంచి 64 ఔట్‌సోర్సింగ్ పోస్టులకు వేలాది దరఖాస్తులను స్వీకరించింది.

సిడిఎస్ ఖాతాలపై కన్నే కారణమా?

జిల్లా వైద్య కళాశాల యంత్రాంగం దరఖాస్తుదారుల నుంచి రూ.200 నుంచి రూ.250 వరకు దరఖాస్తు రుసుం వసూలు చేసింది. ఇలా సేకరించిన రూ.లక్షలాది నగదును సిడిఎస్ ఖాతా సహా మరో ఖాతా పేరుతో నిల్వ చేసింది. అకడమిక్ సూపరింటెండెంట్, ప్రిన్సిపళ్లతో కూడిన జాయింట్ సంతకాలతో ఖర్చు చేయాల్సి ఉంది. జిఎంసిలోని కొంతమంది అధికారులు రూ.లక్షలాది సిడిఎస్ నిధులపై కన్ను పడినట్లు తెలుస్తోంది. మరో సెక్షన్ సూపరింటెండెంట్ మరో ముగ్గురు అధికారులతో కలిసి అకడమిక్ సూపరింటెండెంట్ సీటు మారాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. దీనికి అకడమిక్ సెక్షన్ సూపరింటెండెంట్ సేసేమిరా అనడంతో వ్యవహారం ముదిరిపాకాన పడినట్లు తెలుస్తోంది.

నిద్రావస్థలో జిఎంసి ప్రిన్సిపల్

జిఎంసి అడ్మినిస్ట్రేషన్ సూపరింటెండెంట్ల మధ్య బలవంతంగా సీటు మార్పిడి వ్యవహారం వివాదాస్పదంగా మారినప్పటికీ ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్, డిడి వంటి ఉన్నతాధికారులు తనకేమీ సంబంధం లేదన్నట్లుగా చోద్యం చూస్తున్నారు. ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అనే సంగతి పక్కనబెడితే ఇద్దరు అధికారుల మధ్య నెలకొన్న వివాదాన్ని నివారించాల్సిన గట్టి ప్రయత్నం చేయకపోవడంపై అడ్మినిస్ట్రేషన్ యంత్రాంగం ముక్కున వేసుకుంటోంది. దీనిపై ప్రిన్సిపల్‌ను ఆరా తీయగా ఆ విభాగాన్ని డిడి చూస్తున్నారని, పైగా అకడమిక్ సూపరింటెండెంట్‌పై ఫిర్యాదులు వచ్చాయనడం, ఎటువంటి ఫిర్యాదులు వచ్చాయని అడిగితే సమాధానాన్ని దాటవేయడం గమనార్హం.

పులివెందులలో ఉద్రిక్తత

- ఎన్నికల ప్రచారంలో గొడవ
- వైసిపి నాయకులపై టిడిపి వర్గీయులు దాడి
- ఎమ్మెల్సీ రమేష్‌కు విరిగిన చేయి
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన డిఐజి, ఎస్‌పి

దాడిలో ధ్వంసమైన ఎస్కాట్ వాహన అద్దాలు

టిడిపి దాడిలో గాయపడ్డ రామలింగారెడ్డి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

పులివెందుల జడ్‌పిటిసి ఉపఎన్నిక ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ నెల ఐదున నామినేషన్ల ఉప సంహరణ ముగిసిన అనంతరం ఉప ఎన్నికల ప్రచారం వేడెక్కింది. పులివెందుల స్థానాన్ని ఎలాగైనా గెలవాలనే లక్ష్యంలో భాగంగా టిడిపి, వైసిపి హోరాహోరీ ఎన్నికల పోరు సాగిస్తున్నాయి. బుధవారం నల్గొండువారిపల్లికి ఎన్నికల ప్రచారానికి వెళ్లిన వైసిపి ఎమ్మెల్సీ రమేష్ కుమార్ యాదవ్, వైసిపి నాయకుడు వేల్పుల రామలింగారెడ్డిపై దాడి చేయడం భయాందోళనకు గురిచేస్తోంది. నల్లగొండువారిపల్లిలో రమేష్, రామలింగారెడ్డి తమ బంధువులతో మాట్లాడడానికి వెళ్లారు దాదాపు 10 వాహనాలలో వచ్చి టిడిపి మూకలు కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేయడంతో పాటు వాహనాలను ధ్వంసం చేసి పెట్రోలు పోసి దగ్ధం చేయడానికి ప్రయత్నించారు. స్థానికులు అడ్డుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డామని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ తెలిపారు. గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేశారు. విషయం తెలుసుకున్న కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్.అవినాష్‌రెడ్డి ఆసు పత్రికి చేరుకొని పరామర్శించారు.

కావాలనే గొడవలు సృష్టిస్తున్నారు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మీడియాతో మాట్లాడుతున్న బిటెక్ రవి

కావాలనే వైసిపి వారు రెచ్చగొడుతూ గొడవలు సృష్టిస్తున్నారని పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు బుధవారం మధ్యాహ్నం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సొంత మీడియా ఉందని అబద్దాన్ని నిజం చేయాలని చూస్తున్నారని తెలిపారు. వైసిపికి కనంపల్లె, కొత్తపల్లి, తమకు నల్లగొడువారిపల్లెలో ప్రచారం చేసుకునేందుకు అనుమతి ఇచ్చారని చెప్పారు. వేల్పుల రాము, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మరి కొందరు కలిసి తమ పార్టీ ఏజెంట్ల వద్దకు వచ్చి ప్రలోభాలకు గురిచేసి ఒత్తిడి తెచ్చారని వెల్లడించారు. తమకు ఫోన్ రావడంతో సంఘటనా స్థలానికి వెళ్లామని ఆ సమయంలో ఒకరిపై నొకరు దాడి చేస్తున్నారని చెప్పారు. వైసిపి వారే అనుమతి లేని గ్రామానికి వెళ్లి గొడవ చేశారని పేర్కొన్నారు. ఈ క్రమంలో పరస్పర దాడుల నేపథ్యంలో ఇరు గ్రూపులకు చెందిన వారికి గాయాలయ్యాయని తెలిపారు. తమ పార్టీ కార్యకర్తను కులం పేరుతో దూషించారని, అప్పుడే గొడవ ప్రారంభమైందన్నారు. మా పార్టీ నాయకులు ఇచ్చిన ఆదేశాల ప్రకారం ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించాలని చూస్తుంటే అవతలి వారు కావాలని రెచ్చగొడుతున్నారని వారు పేర్కొన్నారు వైసిపి నాయకులు ఎన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసినా ఫలితం మాత్రం కూటమి అభ్యర్థి విజయం సాధిస్తారని దీమా వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించండి : ఎంపీ

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్.అవినాష్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, సతీష్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు డిఎస్‌పికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని అలాంటి చోట గొడవలు సష్టిస్తున్నారని పేర్కొన్నారు. స్వతంత్ర అభ్యర్థిపై దాడి చేసినవారిని ఇంతవరకు అరెస్టు చేయలేదన్నారు.

ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం : డిఐజి

జడ్‌పిటిసి ఉప ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని కర్నూల్ డిఐజి కోయా ప్రవీణ్ తెలిపారు. బుధవారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా ఉండడం కోసం జిల్లా సరిహద్దులలో చెక్ పోస్ట్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ప్రచారాలను నిర్ణయించిన ప్రాంతాలలోనే నిర్వహించాలని ఇరువు పార్టీ నాయకులను కోరారు. అలా కాకుండా వారికి ఇష్టం వచ్చినట్లు ప్రచారాలు చేస్తే ఇలాంటి ఘటనలు జరిగే ప్రమాదం ఉందన్నారు. పోలీసుల భద్రత ఉండడం వల్లే ధన పాలన నష్టం జరగకుండా కాపాడగలిగామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడం కోసం రౌడీషీటర్‌లను, ట్రబుల్ మెన్స్ లను గుర్తించి వారిపై బైండోర్ కేస్ నమోదు చేశామన్నారు. సబ్ డివిజన్, జిల్లా నుంచి ప్రత్యేక బందాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్‌పి అశోక్ కుమార్, డిఎస్‌పి మురళీ నాయక్ పాల్గొన్నారు.

దాడి ఘటనపై వైఎస్ జగన్ ఆరా

జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో భాగంగా ప్రచార సమయంలో టిడిపి నాయకులు వైసిపి నాయకులపై దాడి చేసిన ఘటనపనై వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆరా తీశారు. బుధవారం రాత్రి ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌కు ఫోన్ చేసి దాడి ఎలా జరిగిందని తెలుసుకున్నారు. దాడిలో గాయాలు ఎక్కడెక్కడ తగిలాయని అడిగారు. దాడి జరిగిన తీరును రమేష్‌యాదవ్ క్షుణ్ణంగా వైఎస్ జగన్‌కు వివరించారు. దీనికి ఆయన స్పందిస్తూ టిడిపి నాయకులు చెత్త రాజకీయాలు చేస్తున్నారని, భయపడకుండా ముందుకు వెళ్లాలని సూచించారు.

డిఎస్‌పి మురళీకి వినతిపత్రం అందిస్తున్న వైసిపి నాయకులు, గాయపడిన ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

మాట్లాడుతున్న మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ జిల్లా విస్తృత సమావేశం నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని చెప్పడం, అధికారంలోకి వచ్చిన తర్వాత వారే మోసం చేయడం టిడిపికి మొదటి నుంచి వస్తున్న ఆనవాయితీ అన్నారు. సంక్షేమ పథకాలు మున్సిపల్ కార్మికులకు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వకుండా కార్మికుల ద్రోహం చేస్తున్నటువంటి టిడిపిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రూ.25 వేల లోపల ఉన్న అవుట్ సోర్సింగ్ ఎంప్లాయ్ ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పి, ఫిక్స్ టర్మ్ ఎంప్లాయ్మెంట్ తెచ్చి కార్మికులకు మోసం చేస్తున్నారని విమర్శించారు. విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 జరిగే జాతీయ మహాసభలో కార్మికులందరూ పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. కార్మికులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి ఒక నివేదికని పంపాలని పేర్కొన్నారు. ఆప్కాస్‌లో పని చేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేసి కార్మికులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పనిచేస్తున్న కార్మికులందరూ ఎనిమిది గంటల పని విధానాన్ని, 12 గంటలకు మార్చడం కేబినెట్ మీటింగ్ పెట్టడం చాలా దుర్మార్గ మని పేర్కొన్నారు. కార్మికులందరూ ఏకమై ప్రభుత్వానికి బుద్ధి చెప్పే విధంగా ముందుకు పోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు కార్యదర్శి రాంమోహన్, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, నగర అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు పి.వి.సుబ్బయ్య. పి.చంద్ర రెడ్డి, మున్సిపల్ జిల్లా అధ్యక్షులు కె.నాగేంద్ర బాబు, కోశాధికారి గోపి, ఉపాధ్యక్షులు తిరుపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి. విజయ్ కుమార్, సహాయ కార్యదర్శులు ఆనంద్‌రావు, బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ నగర అధ్యక్షులు రవి, నగర నాయకులు రాఘవ, సాల్మన్, గంగాధర్ రెడ్డి, భాస్కర్, శ్రీరామ్, ప్రకాష్, మస్తాన్, కిరణ్, చెంద్రయుడు, సత్య నారాయణ, యల్లయ్య, శరత్, శ్రీధర్, నాగేంద్ర, శ్యాం, కార్మికులు పాల్గొన్నారు.

10న పుస్తకాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్ : అభ్యుదయ రచయితల సంఘం (అరసం) కడప జిల్లా అధ్యక్షులు, వైవీయూ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.ఈశ్వర రెడ్డి రచించిన రెండు పుస్తకాల ఆవిష్కరణ సభ కడప సిపి బ్రౌన్ గ్రంథాలయంలో ఈనెల 10 న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. నిత్య బాలింత, సమాజ హితం– సాహిత్య మతం గ్రంథాల ఆవిష్కరణ సభకు దూర ప్రాంతాల నుంచి ప్రఖ్యాత సాహితీ వేత్తలు రానున్నారని పేర్కొన్నారు. సాహితీ అభిమానులు, భాషవేత్తలు, పుస్తక ప్రేమికులు, రచయితలు అధ్యాపకులు, విద్యార్థులు,మిత్రులు అందరూ హాజరుకావాలని పేర్కొన్నారు.

సొసైటీ చైర్మన్‌గా మురుకూటి చిన్నగురివిరెడ్డి

ప్రజాశక్తి-కాశినాయన

మండలానికి సంబంధించి సొసైటీ చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ నాయకులు మురుకుటి చిన్న గురివిరెడ్డి ఎన్నికైనట్లు సొసైటీ సిఇఒ వెంకటేశ్వర్లు తెలిపారు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయన త్వరలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. సొసైటీ అభివృద్ధికి ఆయనతో కలిసి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

వైవీయూ సహ ఆచార్యులకు ఫెల్లోషిప్ సత్కారం

ప్రజాశక్తి- కడప అర్బన్ : అలెగ్జాండర్ వాన్ హంబోల్ట్ (ఏవీహెచ్) పోస్ట్‌డాక్టోరల్ ఫెలో అయిన డాక్టర్ పి. వాసు గోవర్ధన రెడ్డిని జర్మనీలోని హంబోల్ రెన్యూడ్ రీసెర్చ్ ఫెల్లోషిప్‌తో సత్కరించారు. అలెగ్జాండర్ వాన్ హంబోల్ట్ ఫౌండేషన్ ప్రదానం చేసిన ఈ ప్రతిష్టాత్మక ఫెలోషిప్ ఈ ఏడాది మే 1 నుంచి జూలై 31 వరకు మూడు నెలల రెన్యూడ్ రీసెర్చ్ పెలోషిప్‌ను జర్మనీలో పూర్తి చేశారు. ఈయన ప్రొఫెసర్ రెనే విల్హెల్మ్ మార్గదర్శకత్వంలో 'అసమాన ఆర్గానోక్యాటాలిసిస్లో' తన పరిశోధన చేశారు. జర్మన్ దేశంలో పరిశోధనకు అనుమతి ఇచ్చిన యోగి వేమన విశ్వవిద్యాలయ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విజయవంతంగా పరిశోధన పూర్తి చేసుకున్న డాక్టర్ వాసు గోవర్ధన్ రెడ్డిని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, కుల సచివులు ఆచార్య పి పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాస్ సహచర అధ్యాపకులు అభినందించారు.

జోరుగా కూటమి ప్రచారం

ప్రజాశక్తి ఒంటిమిట్ట

జడ్‌పిటిసి ఉపఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి తరుపున నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. రాచగుడిపల్లి గ్రామ పంచాయతీ రాచపల్లిలో పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో జనసేన పార్లమెంట్ నాయకులు యల్లటూరి శ్రీనివాసరాజు, కూటమి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి తెలుగుదేశం అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. తెలుగుదేశం అభ్యర్థి గెలుపుతో ఒంటిమిట్ట అభివృద్ధికి ముందడుగు పడుతుందని, ఒక గెలుపు మండల రూపురేఖలే మార్చే అభివృద్ధికి మలుపు అవుతుందని వారు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు, రాజంపేట నియోజకవర్గ ఆరు మండలాల టిడిపి అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న కూటమి అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డి

ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాశక్తి - కడప : ప్రజాస్వామ్య పద్ధతిలో పులివెందుల జడ్‌పిటిసి ఎన్నికలు నిర్వహించేలా చూడాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి, కడప జిల్లా వైసిపి అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి కోరారు. మంగళవారం రాత్రి జరిగిన దాడుల నేపథ్యంలో బుధవారం వారు ఎస్‌పి అశోక్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి సాను భూతి పరులు సురేష్ కుమార్‌రెడ్డి, అమరేశ్వరరెడ్డి పై దాడి చేయడం అమానుషం అన్నారు. వివాహానికి వెళ్తున్న వారిపై టిడిపి నాయకులు మూకుమ్మడిగా దాడి చేశారన్నారు. వారిని చంపాలనే దాడులు చేశారని తెలిపారు. శాంతియుతంగా ఉన్న పులివెందులలో అరాచకాలు సృష్టిస్తున్నారని వాపోయారు. భయాందోళనలకు గురి చేసేలా అల్లర్లు చేస్తున్నారు అన్నారు. దాడి చేసిన దుండగులపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు లేవు అని ఎస్‌పికి వివరించారు. మళ్ళీ దాడులు వేసిన వాళ్లే శనివారం ఉదయం రసూల్ అనే వైసిపి నాయకుడిపై దాడికి ప్రయత్నించారు అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగేలా చూడాలి అని కోరారు. వైసిపి సానుభూతి పరులపై బైండోవర్ పెడతామని బెదిరిస్తున్నారు అన్నారు టిడిపి నాయకుల మాట విని దాడులు చేస్తే చూస్తూ ఊరుకుని కూర్చునే వారు లేరు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని ఎన్నికలు శాంతియుతంగా నిర్వహి ంచారు. అనవసరమైన నిందలు, ఆరోపణలు చేస్తూ ప్రజలలో అపోహలు సృష్టిసు న్నారని పేర్కొన్నారు. 2019 నుండి 2024 వరకు జగన్ సిఎంగా ఉండగా ఎప్పుడూ ఇలా జరగలేదు అన్నారు. టిడిపి నాయకులు స్వేచ్ఛగా తిరగలేదా? అన్నారు. రాంగోపాల్ రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీగా నిలబడితే ఎక్కడైనా గొడవలు జరిగాయా అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగాయి అన్నారు. శాంతి భద్రతలు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది, ఎటువంటి అల్లర్లకు ఆస్కారం లేకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్‌పి ఈ సందర్భగా హామీ ఇచ్చారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఈగల్ టీం అధికారులు

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి

ప్రజాశక్తి - కడప అర్బన్ : భావి భారత పౌరులుగా విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజానికి తమ వంతు పాత్ర పోషించాలని ఈగల్ అధికారులు పేర్కొన్నారు. బుధవారం 'ఈగల్' ఆధ్వర్యంలో ఆలంఖాన్ పల్లె జెడ్‌పి హెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, ఇతర డ్రగ్స్ కట్టడి చేయడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఈగల్ పేరుతో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎన్‌డిపిఎస్ చట్టాలు, ఎన్‌డిపిఎస్ చట్టంలోని కఠిన శిక్షలు వివరించారు. ఇంటి సమీపంలో, పాఠశాల సమీప ప్రాంతాల్లో ఎక్కడైనా డ్రగ్స్ దుర్వినియోగం, గంజాయి విక్రయాలపై సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1972 కు అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు మాదక ద్రవ్యాల నివారణలో భాగస్వాములవుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ బి.మునిరత్నమ్మ, ఇతర ఉపాధ్యాయులు, ఈగల్ క్లబ్ మెంబెర్స్, నార్కోటిక్ సెల్ ఎ.ఎస్.ఐ మల్లయ్య, 'ఈగల్' హెడ్ కానిస్టేబుల్ అయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

రోడ్డు భద్రత చర్యల ఆంక్షలను జిల్లాలో మరింత కఠినతరం చేసి రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డు రూమ్ హాలులో రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్న రహదారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను కఠినతరం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారుల్లో డివైడర్లను బ్రేక్ చేసి వాహన ప్రమాదాలకు అవకాశం కల్పిస్తున్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలన్నారు. రియల్టర్లు, రాజకీయ ప్రమేయాలకు స్పందించకుండా రోడ్డు భద్రతా ఆంక్షలను పాటించాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎక్కడయినా ప్రమాదాలు సంభవించ కుండా చూడాలన్నారు. ఇంజినీరింగ్ శాఖల వారీగా వారి సంబంధిత రహదారులపై తాజాగా జరిగిన ప్రమాదాలను విశ్లేషించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాల్లో 108 వాహన సేవలు సకాలంలో అందేలా సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యా సంస్థల వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు, అలాగే ప్రతి పెట్రోల్ బ్యాంకులు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల వద్ద సిసి కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. మలుపుల వద్ద బ్యారికెడ్, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలను పొందుపరచాలన్నారు. అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్,సీట్ బెల్ట్ లేకుండా వాహనం నడపడం, పరిమితికి మించి ఆటోలు నడపడం, బస్సులు ఇతర వాహనాలలో అధిక లోడుతో సరుకు, ఇతర సామగ్రి రవాణా చేసే వారిపె కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, కమిటీ సభ్యులైన రోడ్ సేఫ్టీ ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు జి.వి రమణ, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్ అండ్ బి శాఖ అధికారులు, విద్యుత్ శాఖల ఎస్ఇలు, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులు, ట్రాఫిక్, పోలీసు, రవాణా శాఖ అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్లు బదిలీ

- రాయచోటికి రవి, కమలాపురానికి ప్రహ్లాద్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు బదిలీ అయ్యారు. పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాయచోటి మున్సిపల్ కమిషనర్ ఎన్.వాసుబాబు నెల్లూరు మున్సిపల్ నగర పాలక సంస్థ టిపిఆర్ఒగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో రాయచోటి మున్సిపల్ కమిషనర్‌గా జి.రవిని నియమించింది. కమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా కదిరి మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.ప్రహ్లాద్ నియమితులయ్యారు. ప్రొద్దుటూరు మున్సిపల్ సహాయ కమిషనర్‌గా డి.కొండయ్యని నియమించారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కడప అర్బన్

సమాచార హక్కు చట్టం–2005 వార్షికోత్సవ వేడుకలు స్థానిక ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా జోనల్ స్థాయి పోటీలు నిర్వహించారు. జోన్4లోని కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాల నుంచి ఎనిమిది నోడల్ రిసోర్స్ సెంటర్ల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచి అభినందనలు అందుకున్నారు. విజేతలు రాష్ట్రస్థాయిలో ఈనెల 11న విజయవాడలోని ఎస్ఆర్ ఆర్అండ్ సివిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో పాల్గొననున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. సలీం బాషా, వైవీయూ యూనివర్సిటీ జర్నలిజం విభాగం అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు, కడప లీగల్ కౌన్సెలింగ్ అడ్వకేట్ శాంత పాల్గొన్నారు.

అర్హులందరికీ పట్టాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రభుత్వం జారీ చేసిన జిఒ ద్వారా మాసాపేటలో ఇళ్లకు త్వరగా పట్టాలు అందిస్తామని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి, టిడిపి రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇళ్లపట్టాలపై బుధవారం మాసాపేటలో స్థానికుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించి పరిష్కరిస్తామని చెప్పారు. 100 సంవత్సరాలుగా ఇండ్లకు పట్టాలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. తప్పక సమస్య పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్స్‌లపై శిక్షణ

ప్రజాశక్తి - కడప అర్బన్

పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిఐసి ఉప ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారులకు బ్యాలెట్ బాక్స్ వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని జడ్‌పి సిఇఒ, రిటర్నింగ్ అధికారి ఓబులమ్మ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రిసైడింగ్ అధికారులకు, ఎపిఒలకు బ్యాలెట్ బాక్స్‌ల వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్‌పి సిఇఒతోపాఉ పులివెందుల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ వెంకటపతి, ఒంటిమిట్ట అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ రంగస్వామి, డివిషనల్ డెవలప్మెంట్ ఆఫీసర్స్ వి.విజయలక్ష్మి, వి.రామాంజనేయులు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

పాఠశాలలో డిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - వల్లూరు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిఇఒ శంషుద్దీన్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో శిథిలావస్థకు చేరుకున్న హెచ్ఎస్ఆర్ ట్యాంక్‌ను తొలగించాలని సూచించారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. వల్లూరు ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు డాక్టర్ కె. శ్రీనివాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలిస్తున్న డిఇఒ

ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్న ఎన్.తులసిరెడ్డి

కాంగ్రెస్ పాలనలోనే పులివెందుల అభివృద్ధి

ప్రజాశక్తి - వేంపల్లె

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే పులివెందుల నియోజకవర్గం అభివృద్ధి చెందిందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. పులివెందుల జడ్పిటిసి ఉప ఎన్నిక సందర్భంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని తులసిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 12న పులివెందుల జడ్పిటిసి ఉపఎన్నిక జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ తరపున మొయిళ్ల శివకల్యాణ్‌రెడ్డి పోటీ చేస్తున్నారని, హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ధ్రువకుమార్ రెడ్డి, అభ్యర్థి మొయిళ్ల శివకల్యాణ్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, సిరాజుద్దీన్, గౌస్‌పీర్, రామకృష్ణ, సుబ్రమణ్యం, వెంకటేష్, రామాంజనేయరెడ్డి, ఉత్తన్న, నాగరాజు, వేమయ్య, వేమారాజా, రవి, రమణ, రెడ్డి, నరసింహం, హరిప్రసాద్, సంజయ్ కాంత్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇర్ఫాన్ బాషా

అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేయవద్దని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్‌బాషా కోరారు. ఆ మేరకు బుధవారం ఆయన మున్సిపల్ కమిషనర్‌తో చర్చించారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక శివాలయం సెంటర్ నుండి కశెటి స్కూల్ వరకు ప్లాట్‌ఫాంపై ఉన్న మ్యాన్‌హోల్స్‌ను పూడ్చాలన్నారు. వర్షం వచ్చినప్పుడు వీటివల్ల తీవ్ర అసౌకర్యంగా ఉంటుం దన్నారు. కాలువలలో పూడికలు తీయించాలని సూచించారు. ఈ ప్రాంతంలో ఆక్రమణలను తొలగించాలని కోరారు. 13వ వార్డులోనే పలు అభివృద్ధి పనులు చేపట్టాలని కమిషనర్‌ను కోరారు.

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న ఏకలవ్య ట్రైబల్ ఫెడరేషన్ అధ్యక్షులు

ఎస్‌టి కాలనీల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - చాపాడు

ఎస్‌టి కాలనీల్లో దీర్ఘకాలికంగా నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏకలవ్య ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లబోతుల కొండయ్య కోరారు. బుధవారం మైదుకూరు తహశీల్దార్ రాజసింహ నరేంద్రను కలిసి ఎస్‌టి కాలనీల్లో గుర్తించిన సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా మైదుకూరు ప్రాంతంలోని గిరిజనులు, ఎరుకుల కులాలు ఉన్న కాలనీలలో పర్యటించామన్నారు. కనీస అవసరాలకు కూడా కాలనీలు నోచుకోలేదన్నారు. ఎస్‌టిలకు మంజూరు చేస్తున్న నిధులను వారికే కేటాయించాలన్నారు. సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం తరపున అందే పథకాలను అమలు చేయాలని ఆయన కోరారు.

చిన్నారి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మృతి చెందిన ఆరిఫా

స్థానిక వినాయక నగర్‌లో ఓ చిన్నారి అనుమా నాస్పదంగా మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన కథనం మేరకు.. అరిఫా (9) తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లారు. ఆరిఫా రాణివనంలోని స్కూల్‌లో 4వ తరగతి చదువుతోంది. బాలిక తల్లి ఉదయాన్నే బాలికను తయారు చేసి, స్కూల్‌కు వెళ్లమని చెప్పి, పనికి వెళ్లింది. తండ్రి అలీబాషా ట్రాక్టర్ లోడింగ్ పనికి వెళ్లాడు. మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో ఆలీబాషా ఇంటికి వెళ్లగా కూర్చుని ఉన్న కూతురు స్పృహ కోల్పోవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఉయ్యాల ఊగుతూ గొంతుకు బిగించుకొని ఊపిరాడక చనిపోయిందని స్థానికులు అంటున్నారు. సిఐ నరేష్ బాబు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు.

అపస్మారక స్థితిలో ఉన్న సత్యనారాయణ, మృతి చెందిన గొర్రె

పిడుగు పాటుకు గొర్రె మృత్యువాత

- రైతుకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

కొత్త చౌటిపల్లె పునరావాస కేంద్రం సమీపంలోని ఊరి చివర మంగళవారం రాత్రి ఉరుములు మెరుపులతో కురిసిన వర్షం ధాటికి పిడుగు పడి గొర్రె మృతి చెందగా, రైతు సత్య నారాయణ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటిపల్లె పునరావాస కేంద్రంలో నివాసం ఉంటున్న రైతు సత్యనారాయణ గొర్రెలు మేపుకుంటు జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం గొర్రెలను మేతకు తీసుకెళ్లి ఊరి బయట గొర్రెల మంద పెట్టుకుని కాపలాగా అక్కడే పడుకున్నాడు. ఈ నేపథ్యంలో పిడుగు పడింది.

కుక్కల దాడిలో 22 జీవాలు....

ప్రజాశక్తి - తొండూరు

కుక్కల దాడిలో మండలంలోని కోరవానిపల్లి గ్రామానికి కొప్పల రామమోహన్‌కు చెందిన 22 గొర్రె పిల్లలు, మేక పిల్లలు మృతి చెందాయి. తనకు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయడు. తనకు జీవాలే జీవనాధారమని, ప్రభుత్వం ఆదుకోవాలని రామమోహన్ కోరాడు.

ముమ్మరంగా పసుపు సాగు

విత్తన పసుపును సిద్ధం చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి - చాపాడు

గత నెలలో పడిన వర్షాలకు భూములు పదును కావడంతో రైతులు పూర్తిగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పసుపు సాగు ముమ్మరం చేశారు. కుందూ పరిధిలో రైతులు దుక్కిళ్లు, వరి నారు సాగుకు ఏర్పాట్లు, కాలువలలో పూడికతీత, నారుమడి కయ్యల ఏర్పాటు వంటి పనులలో పూర్తిగా నిమగ్నమయ్యారు. పంట పొలాలలో రైతులు పసుపు సాగు చేస్తూ కనిపిస్తున్నారు. జిల్లాలో గత నెలలో వర్షాలు పడడం, సాగుకు సమయం ఆసన్నం కావడంతో సాగు చేపడుతున్నారు. కుందూ పరిధిలో వరి పంట సాగు చేసేందుకు రైతులు బిజీగా ఉన్నారు. మండల పరిధిలో గత ఏడాది 250 ఎకరాలలో పసుపు పంట సాగైంది. ఈ ఏడాది సాగు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం విత్తనపు ధర పుట్టి (300 కిలోలు) రూ.9,500 వరకు ధర పలుకుతోంది. ఎకరాకు ఐదు పుట్ల వరకు రైతులు సాగుకు ఉపయోగిస్తున్నారు. విత్తనపు పసుపును గత ఏడాది సాగు చేసిన రైతులు నుండి సేకరిస్తున్నారు. మైదుకూరు మండలం కేశిలింగాయపల్లి, బండివారిపల్లి, ఉత్సలవరం, గంజికుంట ప్రాంతాల నుండి కొనుగోలు చేస్తున్నారు. ఎకర సాగుకు కూలీలు, విత్తనం, కాడెద్దులతో కలిపి రూ.30 వేల వరకు ఖర్చులు అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. వర్షాలు మోస్తరుగా పడడంతో పసుపు సాగుకు అదును దాటుతుందని రైతులు ముమ్మరంగా సాగు చేస్తున్నారు. కెసి కెనాల్‌కు సకాలంలో నీరు విడుదలైతే 18వేల ఎకరాలలో వరి పంట సాగు జరగవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. చాపాడు, సీతారామాపురం, అల్లాడుపల్లె, కేతవరం, చియ్యపాడు తదితర గ్రామాల్లో పసుపు సాగు చేపడుతున్నారు.

చాపాడు వద్ద పొలంలో పసుపు విత్తనం వేయిస్తున్న రైతు

సంక్షేమ పథకాల అమలులో అన్నీ కోతలే

- వైసిపి పట్టణ అధ్యక్షుడు జయ రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

కూటమి ప్రభుత్వం అరకొర సంక్షేమ పథకాలు ప్రారంభించి, వాటిలో అత్యధికంగా కోతలు విధిస్తూ లబ్ధిదారులకు అన్యాయం చేస్తోందని వైసిపి పట్టణ అధ్యక్షుడు జయ రామకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు పేరు చెప్పి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగించిందని విమర్శించారు. తల్లికివందనం పథకం అమలు చేయడంలో కోత విధించిందన్నారు. చిన్నచిన్న కారణాలను నిబంధనలుగా పేర్కొని తల్లికివందనం పథకం వర్తింపజేయలేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు కోతలు విధించారన్నారు. రూ.20,000 ఇస్తామని, ఇప్పుడు మూడు విడతలుగా ఇస్తామన్నారని తెలిపారు. అందులో కూడా మొదటి విడత రూ.7,000 వేయాల్సి ఉంటే.. కొందరికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.2,000 పడలేదని, మరి కొంత మందికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.5వేలు పడలేదని వివరించారు. రూ.20,000 ఒకేసారి రైతుకు ఇస్తే ఉపయోగారంగా ఉంటుందని ఆయన సూచించారు. మహిళలకు ఉచిత బస్సు అమలు చేస్తామని అంటూనే షరతులు పెడుతున్నారని తెలిపారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికలలో వైసిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలు చేస్తోందని, అది మంచిది కాదని ఆయన హితవు పలికారు.

జిల్లాలో యూరియా కొరత లేదు : జెడి

ప్రజాశక్తి - వేంపల్లె

జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులందరికీ అందజేస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రనాయక్ పేర్కొన్నారు. వేం పల్లెలోని ఎరువుల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం జెడి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వరి నాట్లు వేస్తుండడంతో యూరియా ఎక్కువగా అవస రమవుతున్నట్లు చెప్పారు. జిల్లాకు 70 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు మంజూరైనట్లు తెలి పారు. ఇప్పటి వరకు 12వేల 500 మెట్రిక్ టన్నులు రైతులకు ఇచ్చామన్నారు. ఇంకా 23 వేల 500 మెట్రిక్ టన్నుల ఎరువులు అందు బాటులో ఉన్నట్లు తెలిపారు. అవసరం లేకున్న యూరియా కొనుగోలు చేసి పెట్టుకొంటున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. వేంపల్లె మం డలానికే 180 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు ఇచ్చామన్నారు. పచ్చిరొట్ట ఎరువులు ఇస్తు న్నట్లు చెప్పారు. పచ్చిరొట్ట ఎరువులు వేస్తే 25 శాతం ఎరువుల వాడకం తగ్గిం చుకోవచ్చన్నారు. జీవన ఎరువులు వరి పంటలో వాడితే 10 శాతం ఎరువులు తగ్గించుకోవచ్చని సూచించారు. ఎన్నికల కోడ్ కారణంగా కడప, కమలాపురం, పులివెందుల నియోజకవర్గాల్లోని రైతులకు అన్నదాత సుఖీభవ పడలేదన్నారు. కార్యక్రమంలో ఎఒ శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చంద్రనాయక్

అవసరం మేరకే యూరియా వేయాలి

చాపాడు :అవసరం మేరకే రైతులు యూరియా వేయాలని మండల వ్యవసాధికారి దేవి పద్మలత సూచించారు. మండల పరిధిలోని రాజువారిపేట, విజయనగరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికంగా యూరియా వాడడం వల్ల భూమిలో నత్రజని శాతం పెరుగు తుందన్నారు. వరి పంటలో పాటించాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. కాలి బాటలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. తద్వారా పంటలో గాలి బాగా ప్రసరించడం వల్ల దోమలు వృద్ధి చెందవన్నారు. అర్హత ఉండి అన్నదాత సుఖీభవ పథకం నగదు పడనివారు తమ వివరాలను తెలపాలన్నారు. పంటల నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని, బీమా కూడా చెల్లించాలన్నారు. ఎఇఒ స్వప్న, విఎఎలు సుప్రియ, విమత, రైతులు పాల్గొన్నారు.

పిల్లల పోషణ పట్ల జాగ్రత్త వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శివప్రసాద్

ప్రజాశక్తి - చక్రాయపేట

గర్భధారణ మొదలు ప్రసవం, బిడ్డకు రెండేళ్ల వయసు వరకు అంటే వెయ్యి రోజుల కాలం అత్యంత ముఖ్యమైందని, తల్లికీ, బిడ్డకీ తీసుకునే సంరక్షణ బిడ్డ ఆరోగ్యానికి, భవిష్యత్తుకు పునాది అని డాక్టర్ శివప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం నాగలగట్టుపల్లె అంగన్వాడీ-2 కేంద్రంలో అంగనవాడీ ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాలు వార్షికోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఆ వెయ్యి రోజుల కాలంలో బిడ్డ మెదడు 80 శాతం అభివృద్ధి చెందుతుందన్నారు. పిల్లల రోగనిరోధక శక్తి, ఎదుగుదల, సమగ్రాభివృద్ధి ఆ వెయ్యి రోజుల వ్యవధిలోనే రూపు దిద్దుకుంటాయన్నారు. అందుకు తల్లులు కూడా తాము తీసుకునే ఆహారం, పిల్లల పోషణ పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ఆరోగ్యకరమైన అలవాట్లు, మంచి వాతావరణం ఉండేలా కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసి తల్లి, బిడ్డకీ సహకరించాలని కోరారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రావణి, ఎంపిహెచ్‌ఈఓ రామకృష్ణ, పీహెచ్‌సి సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, తల్లులు పాల్గొన్నారు.

బిడ్డకు ముర్రుపాలు తాగించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

బిడ్డ పుట్టిన గంట లోపు ఆ బిడ్డకు తల్లి ముర్రుపాలు తాగించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుభద్ర తెలిపారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని నందిపల్లె, అలవలపాడు గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో ముర్రుపాలుపై గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలే అత్యంత శ్రేయ స్కరమని చెప్పారు. తల్లి పాలకు ప్రత్యామ్నాయం ఈ ప్రపంచంలో ఏదీ లేద న్నారు. ప్రతి తల్లి పుట్టిన అరగంట నుంచి ఆరు నెలల వరకూ బిడ్డకు తల్లిపాలు మాత్రమే పట్టించాలన్నారు. తల్లిపాలు బిడ్డలకు అంటువ్యాధులు, అసంక్రమిత వ్యాధులను దూరం చేస్తాయని చెప్పారు. జీవితాంతం అవసరమైన సంపూర్ణ ఆరోగ్యానికి బాటలు వేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ డిప్యూటీ సూపర్‌వైజర్ షఫీ ఉన్నిసా, ఆరోగ్య కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తల్లి పాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుభద్ర

కరపత్రాలు విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

ఎఐఎడబ్ల్యూయు జాతీయ సమావేశాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు సెప్టెంబర్ 8, 9, 10వ తేదీల్లో కడప జిల్లాలో పెద్ద ఎత్తున జరుగుతున్నాయని, వాటిని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, ప్రొద్దుటూరు మండల నాయకులు గుర్రం డేవిడ్‌రాజ్ కోరారు. ఆ మేరకు పాత బస్టాండ్ వద్ద సంఘం కార్యాలయంలో బుధవారం వారు కరపత్రాలు విడుదల చేశారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు, నాయకులు వస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 1934లో భారతదేశం కార్మిక సంఘ నాయకుడిగా పుచ్చలపల్లి సుందరయ్య నెల్లూరు జిల్లాలో అలాగానిపాడులో సంఘాన్ని ప్రారంభించారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు 80 లక్షల సభ్యత్వం కలిగిన వ్యవసాయ కార్మిక సంఘంగా ఉందన్నారు. కార్యక్రమంలో శీను, ఓబయ్య, శివ, ఓబులేసు పాల్గొన్నారు.

వనిపెంట గురుకుల పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మండల పరిధిలోని వనిపెంట మహాత్మా జ్యోతిరావ్ పూలే గురుకుల పాఠశాలలో బుధవారం సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్స్ ఎన్.శ్రీనివాసులు, శివ బాలిరెడ్డి, సూర్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపల్ నిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సుబ్బారావు

ఫోక్సో చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో పోలీసులు స్థానిక సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా ఎస్ఐ సుబ్బారావు మాట్లాడుతూ సమాజంలో బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిపై చట్టపరమైన చర్యల గురించి వివరించారు. ఫోక్సో చట్టం ద్వారా పిల్లలకు లైంగిక వేధింపుల నుండి ఎలా రక్షణ లభిస్తుందో, గృహ హింసకు గురైన మహిళలు ఎలాంటి సహాయం పొందవచ్చో స్పష్టం చేశారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. భయపడవద్దని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థినులు అడిగిన ప్రశ్నలకు ఎస్ఐ సుబ్బారావు సమాధానాలు ఇచ్చి వారిలో భద్రతపై మరింత నమ్మకం కలిగించారు. కార్యక్రమం బాలికలలో ఆత్మవిశ్వాసం, తమ హక్కుల పట్ల అవగాహన పెంచడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

అంగన్వాడీలు సెల్‌ఫోన్లు తీసుకెళ్లాలి

- ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి అధికారి స్వర్ణలత

ప్రజాశక్తి - వేంపల్లె

అంగన్వాడీ వర్కర్స్ సహకరించి వారి సెల్‌ఫోన్‌లను తీసుకెళ్లాలని వేంపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జి స్వర్ణలత కోరారు. ఐసిడిఎస్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లె ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్వాడీ వర్కర్స్ అందరూ సెల్‌ఫోన్‌లు సరిగా పని చేయడం లేదని ప్రాజెక్టు కార్యాలయంలో పెట్టి వెళ్లిపోయారని తెలిపారు. ఈ విష యాన్ని జిల్లా ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. కొత్త సెల్ ఫోన్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. అవి వచ్చే వరకు పాత సెల్‌ఫోన్‌లను తీసుకెళ్లి వీలైనంత వరకు పని చేయాలని కోరారు. సెల్‌ఫోన్‌ల సమస్య త్వరగా పరిష్కారం అవుతుందని తాను భావిస్తున్నాని పేర్కొన్నారు.

విజేతలను ప్రకటిస్తున్న ఎంపిడిఒ దివిజా సంపతి

క్విజ్ పోటీల్లో ఫస్ట్ 'ఆదర్శ' విద్యార్థులు

ప్రజాశక్తి - ఖాజీపేట

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీలకు విశేష స్పందన లభించింది. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను ఎంపిడిఒ దివిజా సంపతి ప్రారంభించారు. మొదటి బహుమతిని ఆదర్శ పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. రెండవ బహుమతి జడ్పి బాలికల ఉన్నత పాఠశాలకు దక్కింది. మూడవ బహుమతి రెయిన్‌బో విద్యార్థులు సాధించారని ఎంపిడిఒ తెలిపారు. వీరికి ఈనెల 15న బహుమతులు అందజేయనున్నట్లు ఆమె వివరించారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం

ముద్దనూరు ఎపి ఎన్‌జిఒ ఎన్నికలు ఏకగ్రీవం

అధ్యక్షులుగా శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శిగా జాసన్, కోశాధికారిగా డాక్టర్ కరిష్మా

ప్రజాశక్తి - ముద్దనూరు : ముద్దనూరు ఎన్‌జిఒ కార్యాలయంలో బుధవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ముద్దనూరు తాలూకా ఎపి ఎన్‌జిఒ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి ఎం.బ్రహ్మానందరెడ్డి, సహాయ ఎన్నికల అధికారి నరసింహారెడ్డి, పరిశీలకులు డి.రవికుమార్ సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, తహశీల్దార్ ఆలీఖాన్, ఉప ఖజానా అధికారి ప్రమీలాదేవి పరిశీలించారు. ఎన్నికల అధికారి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ అధ్యక్షులుగా శ్రీకాంత్‌రెడ్డి, సహ అధ్యక్షులుగా వి.రమణయ్య, ఉపాధ్యక్షులుగా షేక్ యాసీన్, రాజశేఖర్ నాయుడు, జి.ప్రసాద్‌రెడ్డి, బి.చుక్రు, కార్యదర్శి ఎం.జాసన్, జాయింట్ సెక్రటరీలు సి.అనిల్‌కుమార్‌రెడ్డి, పి.ఎస్.విశాలక్ష్మి, ఎ.పరమేశ్వరి, ఆర్.ఓబులేసు, కోశాధికారి డాక్టర్ కరిష్మా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రామా రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ కార్యవర్గం మూడేళ్లపాటు కొనసాగుతుందన్నారు. జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ పెండింగులో ఉన్న డిఎ, పిఆర్‌సి, సరెండర్ బిల్లులు, వైద్య ఆరోగ్యశాఖ ఎఫ్‌టిఎ బిల్లులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

పెయింటర్స్ యూనియన్ అధ్యక్షుడిగా నాగేంద్ర

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) : ప్రొద్దుటూరు పెయింటర్స్ యూనియన్ అధ్యక్షుడిగా నాగేంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రొద్దుటూరు పెయింటర్ యూనియన్ ఐదవ సమావేశాన్ని బుధవారం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించారు. వైస్ ప్రెసిడెంట్‌గా వి.వెంకటకృష్ణ, సెక్రటరీగా పి.ఏసోబు, జాయింట్ సెక్రటరీగా జిఎస్‌ఎం బాషా, ట్రెజరర్‌గా పి.సాంబయ్య, జాయింట్ ట్రెజరర్‌గా ఎం.చిన్నా, సలహాదారులుగా ఎం మత్తయ్య, వి.ప్రసాద్ రావు, కుండ బాలదాసు, దాసు, జి.శివప్రసాద్, రొక్కం సుబ్బరాయుడు, పి రవి, జె.మదన్, ఎస్‌సి రాజుద్దీన్, చంద్ర, జి.హరి నారాయణ, చంద్రారెడ్డి, బాషా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు నాగేంద్ర, సెక్రెటరీ ఏసోబు మాట్లాడుతూ ప్రొద్దుటూరు పెయింటర్స్ అసోసియేషన్ అభివృద్ధికి సాయశక్తిలా కృషి చేస్తామన్నారు. పెయింటర్స్ అందరికీ ప్రభుత్వం తరపున ఉన్న అవకాశాలు అందేలా చూస్తామన్నారు. ఎలాంటి ఇబ్బందులకైనా యూనియన్ తరపున పోరాడుతామన్నారు. కార్యక్రమంలో పెయింటర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

అధ్యక్ష, కార్యదర్శులతో పెయింటర్స్ యూనియన్ సభ్యులు